క్లుప్తంగా

గ్రామాల్లో జోరుగా సేవా కార్యక్రమాలు



మండపేటలో పేదలకు అన్నదానం చేస్తున్న పాపారాయుడు అభిమానులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట, అర్తమూరు గ్రామాల్లో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మండపేట పట్టణంలోని ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థలో పేదలకు అన్నదానం చేశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పలు ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు అర్తమూరులోని పాపారాయుడు నివాసంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం

రాయవరం: జునోసిస్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మాచవరం పశు వైద్యురాలు ఎం.బిందు అన్నారు. స్థానిక పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందు మాట్లాడుతూ పెంపుడు జంతువుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన టీకాలు, వ్యాక్సిన్లు సమయానికి వేయించాలన్నారు. ముఖ్యంగా పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకాలు ఇచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెంపుడు జంతువుల సంరక్షణతో పాటు వాటి నుంచి మనుషులకు జబ్బులు రాకుండా అవసరమైన టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం మాచవరం పశువైద్యశాల పరిధిలోని పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ చేశారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన సత్తెమ్మతల్లి



శాకంబరి అలంకారంలో సత్తెమ్మతల్లి

రాయవరం: మండలంలోని వెదురుపాక–ఆరికరేవుల రోడ్డులో పంట పొలాల మధ్య వేంచేసిన కొర్లవారి సత్తెమ్మ తల్లి ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. మాచవరపు వెంకట సురేష్ ఆధ్వర్యంలో 50 కేజీల కూరగాయలతో సత్తెమ్మతల్లికి శాకంబరి అలంకరణ చేశారు. వి.సావరం గ్రామానికి చెందిన కాకి శ్రీను కుమారుడు వెంకట సత్యసాయి మణికంఠ కూరగాయలు వితరణ చేశారు. పుట్టకొండ గ్రామానికి చెందిన విజయదుర్గా శక్తి పీఠం గురువు దంగేటి త్రిమూర్తులు గురుభవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాచవరపు సత్యనారాయణ, లక్ష్మి దంపతులు, వెదురుపాక, వి.సావరం, మెళ్లూరు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సామాజిక స్థితిగతులకు చిహ్నం ఏకలవ్యుడు

కపిలేశ్వరపురం (మండపేట): ఏకలవ్యుడు ఆనాటి రోజుల్లోని సామాజిక స్థితిగతులకు చిహ్నమని అమలాపురం ఎంపీ జి.హరీష్ మాథూర్ అన్నారు. మండపేట పట్టణం 26వ వార్డు దుర్గమ్మగుడి వద్ద ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏకలవ్య జయంతి వేడుకలకు ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. గురువుపై అపార భక్తిని చాటి తన బొటన వేలును త్యాగం చేసిన ఏకలవ్యుడు నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి, కోనసీమ ఎరుకుల సంఘం జిల్లా కార్యదర్శి సమతం చిన్న పాపారావు, మండపేట మండల సంఘం అధ్యక్షుడు అమలదాసు రుద్రమూర్తి, కార్యదర్శి సింగం రాంబాబు, అమలదాసు చిన్నబ్బులు, గోవిందు, అన్నవరం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, టేకి, మాచర మట్టలు, శ్రీరామపురం, వల్లూరు గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆదివారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందన్నారు. నల్లూరులో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న కారణంగా నల్లూరు గ్రామంలో సైతం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రత్నాలరావు కోరారు.

అది స్వర్ణయుగమే..

- అభివృద్ధి ప్రదాత డాక్టర్ వైఎస్సార్
- నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన మహానేత
- రేపు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

రామచంద్రపురం: అదో స్వర్ణయుగం.. అభివృద్ధి అంటే ఇదీ..అని తరతరాలుగా చెప్పుకునేలా పాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన హయంలో నియోజకవర్గం అన్ని రంగాలలోను జరిగిన అభివృద్ధి పనుల ఫలాలు అందుకుని నియోజకవర్గ ప్రజలు ఆయనను స్మరించుకుంటున్నారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ చలువతోనే జరిగిన అభివృద్ధిని నియోజకవర్గ ప్రజలు జ్ఞాపకం చేసుకుంటున్నారు.

- 2004 నుంచి 2009 వరకూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోను అప్పుడు క్యాబినెట్‌లో మంత్రిగా పని చేసిన పిల్లి సుభాష్ చంద్రబోస్ కృషితో రూ.700 కోట్లతో అభివృద్ధి చేశారు.
- వైఎస్సార్ హయంలో 2009లో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి పట్టణంలో అట్టహాసంగా నిర్వహించి దేశస్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడకు ఈ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. రామచంద్రపురం పరిసర ప్రాంత విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందించాలని వైఎస్ సకల్పంచించారు. 2008లో వేంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో పశువైద్య పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.3.5కోట్లు, ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణాలకు రూ.4.5కోట్లు కేటాయించి భవనాలు నిర్మించారు. కళాశాలలతో పాటుగా వసతి గృహ నిర్మాణాలు కూడా చేయడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వైఎస్సార్ ఉద్యాన వన కళాశాలలో విద్యార్థులు విద్యనభ్యసించి అనేక రంగాల్లో స్థిరపడుతున్నారు.
- పట్టణంలోని ముచ్చుమిల్లిలో నాలుగు ఎకరాల స్థలంలో 14బ్లాకుల్లో 336 కుటుంబాలకు ద్రాక్షారామ రోడ్డులో తాళ్లపాలెం వద్ద 18 బ్లాకుల్లో 432 కుటుంబాలకు రూ.5కోట్లతో రాజీవ్‌గృహకల్ప జీప్లస్‌టూ నిర్మాణాలు చేశారు. 10 ఎకరాల స్థలంలో ఈ ఇళ్లను నిర్మించి వైఎస్ఆర్ నగర్‌ను నిర్మించారు. మున్సిపాలిటీ భవన నిర్మాణానికి 2006లో ఒక కోటి రూపాయాలు మంజూరు చేశారు. పురాతన భవనంతో ఉన్న మున్సిపాలిటీ ఆయన చలువతో నూతన భవనం ఏర్పడింది.

మున్సిపాలిటీ తాగునీటి సమస్యను గుర్తించిన వైఎస్ రాజశేఖరరెడ్డి రక్షిత మంచినీటిని అందించేందుకు 2009లో రూ.21కోట్లతో వెల్ల రక్షిత మంచి నీటి పథకాన్ని మంజూరు చేశారు. అందుకోసం రామచంద్రపురం మండలం వెల్లలో 58 ఎకరాలను సేకరించి 2010లో శంకుస్థాపన చేయగా అప్పటి మంత్రి సుభాష్‌చంద్రబోస్ కృషితో వెల్ల రక్షిత మంచినీటి పథకం పూర్తి చేసుకుని రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ ప్రాజెక్టు నుంచి రక్షిత మంచి నీటిని అందించే విధంగా దీని నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ప్రజలకు వెల్ల రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటని అందిస్తున్నారు.

- రూ.9 కోట్లతో బైపాస్ రోడ్డును నిర్మించారు. కె.గంగవరం మండలంలోని సుందరపల్లి నుంచి బ్రహ్మపురి వరకూ 2006లో 21 కిలోమీటర్లు ఏటిగట్టును రూ.21 కోట్లతో ఏటిగట్టుకు సమాంతరంగా మరో గట్టును వేశారు.
- హసన్‌బాదలో రూ.5కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం చేశారు.
- 2004లో గొల్లపాలెంలో బారీ రక్షిత మంచినీటి పథకం ప్రారంబించి 26 గ్రామాలకు త్రాగునీరందించారు. పట్టణంలోని 1వ వార్డులో 2008లో 32 ఎకరాలను రూ.16 కోట్ల సేకరించి ఇళ్ల లేని 2,800 మందికి పట్టాలను అందించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ క్రీడా ప్రాంగణంలో ఒక కోటి రూపాయలతో ఇండోర్ స్టేడియంను వైఎస్ నిర్మించారు. పట్టణంలోని ఎంతో పేరు ప్రఖ్యాతులు చెందిన కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలకు రూ. 50 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేశారు.
- డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న అయిదేళ్ల కాలంలో జరిగిన అబివృద్ధిని నేటికీ నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేదు. తరతరాలుగా గుర్తుండిపోయేలా జరిగిన అభివృద్ధిని, ఆయన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. మంగళవారం 75వ జయంతిని పురస్కరించుకుని నియోకవర్గంలో మహానేతకు ఘనంగా నివాళులర్పించేందుకు ఆయన అభిమానులు సిద్ధమవుతున్నారు.



తాళ్లపాలెంలోని రాజీవ్ గృహకల్ప భవన సముదాయం



వైఎస్ హయంలో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం



కృత్తివెంటి క్రీడా ప్రాంగణంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం

నిండు శోకంతో మొహర్రం



ద్రాక్షారామలో మాతం(రక్త తర్పణం) చేస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలో మొహర్రం సంతాప దినాలను నిండు శోకంతో నిర్వహించుకున్నారు. లఖ్నవ్(ఫైజాబాద్) నుంచి వచ్చిన మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మజ్లిస్‌ల రూపంలో కర్బలా అమర వీరుల త్యాగాలను వివరించారు. ఇమాం హుస్సేన్ షహీద్(వీర మరణం) సందర్భంగా 11 రోజుల పాటు ద్రాక్షారామలో పీర్(అలం) గుర్రంపై ఊరేగింపు, మాతం(రక్త తర్పణం) జరిగాయి. శనివారం రాత్రి మాతంతో ఆగావారి పెద్ద పంజా నుంచి బార్‌మే ఇమాం(తల్లి పీరు) ఊరేగింపు ప్రధాన ఘట్టంగా నిర్వహించారు. ఇమాం హుస్సేన్ షహీద్(వీర మరణం) రోజైన ఆదివారం ఉదయం ప్రత్యేక నమాజు చేసి, పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు ఆయా పంజాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తూ తమ వీపుల పైన, ఛాతీలపైన, శిరస్సులపైన రక్తం చిందేలా మాతం చేసి ఇమాం హుస్సేన్‌పై భక్తిని చాటుకున్నారు. మొక్కులు సమర్పించుకున్నారు. పీరులు(అలం)లను, గుమ్మటాలను చెరువుకు తీసుకునివెళ్లి కడిగి శాంతింపజేశారు. పంజాముజావర్లు, అంజుమన్ సంఘాలు భక్తులకు భోజన వసతి కల్పించారు. ద్రాక్షారామతోపాటు పరిసర గ్రామాలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు. ఇమాం హుస్సేన్ అభిమాన సంఘాలైన అంజుమనే హుస్సేనీ, అంజుమనే పరమానఏ అబ్బాస్, పంజతని, మాతం దారనే హుస్సేని, సఖ్యాఏ సకీనా, అజాదారానే హుస్సేని, అంజుమనే అలీ అక్బర్, అంజుమనే అలీ అస్గర్, పలు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలలో సహకారమందించాయి.

త్యాగానికి ప్రతీక మొహర్రం

కపిలేశ్వరపురం: దైవ ప్రసన్నతే లక్ష్యంగా సాగిన సమరంలో హజ్రత్ హిమామె హుస్సేన్ అమరుడు కావడం త్యాగపూరిత జీవితానికి ప్రతిక అని పలువురు వక్తలు అన్నారు. అంగరలోని పీర్ల పంజా, మసీద్-ఎ-ఇబ్రహీం మొహర్రం సంతాప దినాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మసీదు ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్తర్, ముతవలి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, పీర్ల పంజా నిర్వాహకుడు షేక్ వలీ తదితరుల ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ మొహర్రంను విషాదం అనుకోవడం సరికాదన్నారు. ప్రవక్త మహ్మద్ సల్లల్లాహ్ ఆలైహి సల్లెం మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ రజి అల్లాహు ఇస్లాం ధర్మం కోసం అమరత్వాన్ని పొందడాన్ని స్మరించుకునే గొప్పదినమన్నారు. జీవిత పరమార్థాన్ని తెలుసుకునేందుకు వీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక పరిసర గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

జనంలో నిరంతరం పని చేయండి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కూటమి పాలనలో సమస్యలతో సతమతమవుతున్న సామాన్య ప్రజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం పని చేయాలని ఎమ్మెల్సీ, ఆ పార్టీ మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు సూచించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన జిల్లా కమిటీ జాబితాలో మండపేట నియోజకవర్గం పరిధిలోని కొందరికి స్థానం దక్కింది. వారంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గం కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయని పరిస్థితులపై నిరంతరం ప్రజలు తరపున పోరాడాలని జిల్లా కమిటీలో స్థానం పొందిన నాయకులకు ఎమ్మెల్సీ తోట సూచించారు.

జిల్లా కమిటీలో మండపేట నియోజకవర్గానికి ప్రాధాన్యం ఇలా..

జిల్లా కమిటీలో స్థానం	పేరు	పట్టణం/మండలం
ఉపాధ్యక్షుడు	దూలం వెంకన్నబాబు	మండపేట రూరల్
యాక్టివిటీ సెక్రటరీ	టేకిమూడి శ్రీనివాసరావు	మండపేట పట్టణం
యాక్టివిటీ సెక్రటరీ	గుడిమెట్ల శివరామకృష్ణ	కపిలేశ్వరపురం
ఆర్గనైజేషనల్ సెక్రటరీ	కొప్పిరెడ్డి వెంకటరమణ శివప్రసాద్	మండపేట రూరల్
ఆర్గనైజేషనల్ సెక్రటరీ	పలివెల మధు	కపిలేశ్వరపురం
అధికారప్రతినిధి	సిరిపురపు శ్రీనివాసరావు	రాయవరం



దూలం వెంకన్నబాబు



టేకిమూడి శ్రీనివాసరావు



గుడిమెట్ల శివరామకృష్ణ



కొప్పిరెడ్డి వెంకట రమణ శివప్రసాద్



పలివెల మధు



సిరిపురపు శ్రీనివాసరావు

ఎరుకుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



ఐక్యతను చాటుతున్న ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు

రాయవరం: ఎరుకుల సామాజికవర్గ సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సింగం శ్రీను డిమాండ్ చేశారు. రాయవరంలో ఆదివారం ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల సామాజిక వర్గీయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎదురవుతున్న సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలన్నారు. ఎరుకుల సంక్షేమానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. తొలుత ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంఘం నాయకులు చేయి చేయి పట్టుకుని ఐక్యతను చాటారు. కార్యక్రమంలో ఎరుకుల సంక్షేమ సంఘం కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లా శాఖల అధ్యక్షులు మానుపాటి గోవిందు, మానుపాటి రామకృష్ణ, సంగడాల వెంకట్రావు, మండల శాఖ అధ్యక్షుడు గాడా పట్టాభిరామయ్య, సెక్రటరీ గాడా రామచంద్రరావు, సంఘం నేతలు అమలుదాసు పట్టాభి, గాడా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి



ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎరుకుల సంఘం నాయకులు

కె.గంగవరం: పామర్రులో ఆదివారం ఏకలవ్యుని జయంతిని ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ సభ్యులు నాయకులు కలసి ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. తర్వాత నిర్వహించిన సభలో అధ్యక్షుడు బి.గోవిందు, కార్యదర్శి ఎస్.రాజు, ఉపాధ్యక్షుడు ఎ.రాంబాబు తదితరులు మాట్లాడుతూ ఏకలవ్యున్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో జీవించాలన్నారు. రాజకీయ పార్టీలు ఎరుకుల కులానికి చెందిన ఓట్లను దండుకుంటున్నారే కానీ తమకు న్యాయం చేయడం లేదన్నారు. రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు ప్రతి మండలంలో ఎరుకుల సంఘానికి కమ్యూనిటి హాల్ కేటాయించాలని, రాజ్యాంగం ప్రకారం ఎరుకుల కులాన్ని గుర్తించాలని కోరారు. సంఘ మాజీ అధ్యక్షుడు అమలదాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళం వినిపిస్తా..

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ



పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి అన్నాయిపేటకు చెందిన పెమ్మిరెడ్డి మురళి వెంకట కృష్ణారావు నియమితులయ్యారు. ఆయనకు నియామక ఉత్తర్వులు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అందాయి. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తన నియామకంపై పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు తోట త్రిమూర్తులు, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజా సమస్యలపై పార్టీ గళం వినిపిస్తానని తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శుల ఎంపిక



మాత నూకరావు



చొల్లంగి చిన్నారి

కాజులూరు: మండల గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శులను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ కార్యాలయ సిబ్బంది విడుదల చేసిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగ్గుదుర్రుకు చెందిన మాత నూకరావు జిల్లా ఆర్గనేజింగ్ సెక్రటరీగాను, కాజులూరు ముత్యాలమ్మ వేపచెట్టు పేటకు చెందిన చొల్లంగి బాలసూర్యప్రకాశ్(చిన్నారి) జిల్లా యాక్టివిటీ సెక్రటరీగాను నియమితులయ్యారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మండపేటలో విశేష అలంకరణలో భక్తాంజనేయస్వామి

కపిలేశ్వరపురం: విష్ణుమూర్తికి ప్రీతికరమైన తొలి ఏకాదశి వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరలోని వేణుగోపాలస్వామి, వైభవ వేంకటేశ్వరస్వామి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర గ్రామాల్లోని నవ జనార్దనస్వామి, టేకిలోని వేంకటేశ్వరస్వామి, వెదురుమూడి, కాలేరు గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లోనూ విశేష పూజలు చేశారు.

మండపేటలో...

మండపేట పట్టణం, మండలంలోని కేశవరం, ద్వారపూడి, అర్తమూరు, మారేడుబాక, ఏడిద, ఏడిద సీతానగరం, ఇప్పనపాడు, పాలతోడు, వెలగతోడు, జెడ్.మేడపాడు, మెర్నిపాడు గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. మండపేట వాణీమహల్ జంక్షన్ వద్ద వేంచేసిన భక్తాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సలాది రాజా ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. జొన్నల వెంకటేశ్వరరావు, జొన్నల సత్యనారాయణ, జొన్నల చంద్రశేఖర రావు, సలాది రాజా కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో ప్రసాద వితరణ చేశారు.

దళిత జనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్

- గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ వర్ధంతి
- ఆయన విగ్రహాలకు నివాళులర్పించిన నేతలు



మండపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళుర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం: దళిత జనోద్ధారకుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు అన్నారు. నియోజకవర్గంలోని మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో ఆయన వర్ధంతిని నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురం, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, మాచర, నల్లూరు, అంగర, నేలటూరు, తాతపూడి గ్రామాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నాయకులు పిప్పర సంపతరావు, మల్లిపూడి శివకుమార్ పలివెల లాజరు, పలివెల వెంకట్రావు, ముమ్మిడివరపు సత్యం, కొమ్ము సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో...

మండపేట పట్టణంలోని మహనీయుల విగ్రహాల సెంటర్‌లో వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్, పార్టీ నియోజకవర్గ ఆర్‌టీఐ వింగ్ కన్వీనర్ మండపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా జగ్జీవన్‌రామ్ అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి గాంధీ చేసిన ఉద్యమాల్లో జగ్జీవన్‌రామ్ అంకితభావంతో పాల్గొనేవారన్నారు. 1936 నుంచి 1986 వరకు 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పార్లమెంట్ సభ్యుడిగా పనిచేయడం ఆయన ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి శ్రీనివాస్, జొన్నపల్లి సత్తిబాబు, యర్రగుంట అయ్యప్ప, యరమాటి వెంకన్నబాబు, యర్రవరపు సూరిబాబు, అంధనాపల్లి రవి, రమేష్, శీలి సత్యనారాయణ, చిన్ని విజయ్, దుగ్గిరాల చిన్న పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు వల్లభనేని రవీంద్ర బాబు, గొడవర్తి రామచంద్రరావు, ముద్దుల సుబ్బారావు, సందక వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

కాజులూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీ వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఏపీ కైలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. ఆదివారం మండలంలోని తర్లంపూడి, టి.మామిడాడ తదితర గ్రామాల్లో రాజబాబు తదితర నాయకులు పర్యటించి రైతులు, ఉపాధి హామీ పథకం కూలీలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తర్లంపూడిలో ఆయన మాట్లాడుతూ శ్రమజీవులను అణగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకు వస్తూ కార్మికులపై పని భారం మోపుతుందన్నారు. ఉపాధి పథకానికి బడ్జెట్‌లో నిదులు తగ్గించటంతో కులీలకు పనిధినాలు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వం విదానాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బుడితి ప్రభాకరరావు, ఇసుకపట్ల సుబ్రహ్మణ్యం, నందిక ఇమ్మానుయేలు, పువ్వల భైరవస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

కాజులూరు: కోలంకలో షార్ట్ సర్క్యూట్‌కు గురై తాటాకు ఇల్లు పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని నామవారి వీధిలో కొడగాల వెంకటేశ్వర్లు, అతని కుమారుడు చిన్నా కుటుంబ సమేతంగా నివాసముంటున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటిపై నుంచి అకస్మాత్తుగా మంటలు సంభవించాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవ్వరూ లేకపోవడంతో స్థానికులు గమనించి కాకినాడ ఫైర్ స్టేషన్‌కు సమాచారమందించారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. చుట్టుపక్కలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఇంటిలోని సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నామని కాకినాడ జిల్లా సహాయ ఫైర్ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

భీమేశ్వరుని సన్నిధిలో సర్వే అండ్ లాండ్స్ అడిషనల్ కమిషనర్



వేదాశీర్వచనం అందుకుంటున్న అడిషనల్ కమిషనర్ గోవిందరాజు, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అడిషనల్ కమిషనర్ ఆర్.గోవిందరావు ఆదివారం కుటుంబ సమేతంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. వారి వెంట రామచంద్రపురం ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, వీఆర్ఓ పరంజ్యోతి, సర్వేయర్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.